# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శనివారం - 8- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 65 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




## ఏఐతో జీఎస్టీ ఆదాయం పెంపుపై

# రాష్ట్ర ప్రభుత్వ దృష్టి

### పన్నుల లీకేజీల నివారణకు సమగ్ర కార్యాచరణపై చర్చ

హైదరాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయాన్ని పెంచేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తూ పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అంశంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో పాటు ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు.ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేయడం, ఆదాయ వనరులను పెంపొందించడం, ప్రణాళికాబద్ధంగా సంస్కరణలను అమలు చేయడం వంటి అంశాలపై సమీక్షించారు.

జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై ప్రత్యేకంగా చర్చించిన సమావేశంలో, జీఎస్టీ అధికారులకు కృత్రిమ మేధస్సు ఆధారిత సమాచార వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. దీంతో పన్నుల వసూళ్లు సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవస్థను రూపొందించాలని సూచించారు.

మిగతా 2లో

# రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ యాగం

## ఈ నెల 10న నాగార్జునసాగర్‌లో నిర్వహణ



హైదరాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, నదులు జలకళ సంతరించుకోవడంతో పాటు పాడిపంటలు సమృద్ధిగా పండాలని సంకల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు.

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ నెల 10వ తేదీన నాగార్జునసాగర్ డ్యామ్ తీరంలోని విజయవిహార్ ప్రాంగణంలో వరుణ యాగం నిర్వహించనున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేదపండితులు వేదోక్త పద్ధతిలో యాగ క్రతువులను నిర్వహిస్తారు.

మిగతా 2లో



## సైబర్ నేరాల నియంత్రణలో

# తెలంగాణ నంబర్ వన్

- దేశవ్యాప్తంగా తొమ్మిది కీలక ప్రమాణాల్లో అగ్రస్థానం
- రెండు నెలల్లోనే విశేష పురోగతి సాధించిన పోలీసు శాఖ
- సమష్టి కృషితో వచ్చిన ఫలితమన్న డీజీపీ సి.వి. ఆనంద్

2లో

## ప్రత్యామ్నాయ పంటలే రైతుకు భరోసా

- వరి సాగు విస్తరణపై ప్రభుత్వం హెచ్చరిక
- ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- కలెక్టర్లతో మంత్రుల వీడియో సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులు అధిక నీటి అవసరమున్న వరి సాగును మరింత విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో

మిగతా 2లో






# జీహెచ్‌ఎంసీ బరిలో బీజేపీ ఒంటరి పోరు

- పొత్తులు ఉండవని రామచందర్‌రావు స్పష్టం
- పార్టీ బలోపేతంపై జాతీయ నాయకత్వం దిశానిర్దేశం
- డబుల్ ఇంజిన్ సర్కార్ లక్ష్యమన్న బీజేపీ

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):

రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎటువంటి రాజకీయ పొత్తులు లేకుండానే ఎన్నికల బరిలోకి దిగుతామని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో సమావేశమైన అనంతరం రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు.

మిగతా 7లో

## ఏఐతో పాలనకు పదును



- హైదరాబాద్‌లో ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ సదస్సు
- పాలనలో కృత్రిమ మేధ వినియోగంపై చర్చ
- ప్రజాసేవలను మరింత సమర్థంగా తీర్చిదిద్దే లక్ష్యం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

2లో

## నేతన్నల కోసం సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ



- చేనేత పథకాల పునరుద్ధరణకు డిమాండ్
- కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు
- హామీలు వెంటనే అమలు చేయాలన్న విజ్ఞప్తి

2లో

## చేనేత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా వేడుకలు
- 100కుపైగా చేనేత స్టాల్స్ ప్రారంభం
- కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కార గ్రహీతలకు సత్కారం
- నేతన్నలకు అండగా తెలంగాణ ప్రభుత్వం



2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# చేనేత సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్రస్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యంతో పనిచేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కారాలకు ఎంపికైన కళాకారులను ఘనంగా సత్కరించారు. చేనేత రంగానికి విశేష సేవలు అందించిన వారికి పురస్కారాలు అందజేసి అభినందించారు. చేనేత కళాకారుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా ఈ రంగానికి మరింత గుర్తింపు తీసుకురావచ్చని మంత్రి పేర్కొన్నారు.



అనంతరం పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ఏర్పాటు చేసిన 100కు పైగా స్టాల్స్‌ను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. సంప్రదాయ చేనేత నైపుణ్యంతో రూపొందించిన చీరలు, వస్త్రాలు, గృహోపకరణాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శన ఆగస్టు 7 నుంచి 16 వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన తుమ్మల నాగేశ్వర రావు, చేనేత అనేది కేవలం ఉపాధి రంగం మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, వారసత్వానికి ప్రతీక అని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ కళను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అంతరించిపోతున్న సంప్రదాయ చేనేత కళలకు పునర్వైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

తెలంగాణ చేనేత ఉత్పత్తులు దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. గద్వాల చీరలు, పోచంపల్లి ఇక్కత్, నారాయణపేట వస్త్రాలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ బెడ్‌షీట్లు తెలంగాణకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని చెప్పారు. సంప్రదాయ చేనేతకు ఆధునిక మార్కెట్ అవకాశాలను కల్పిస్తూ ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు. నేతన్న పొదుపు పథకం, నేతన్నకు భద్రత పథకం, చేనేత రుణమాఫీ, నేతన్న భరోసా వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల కుటుంబాలకు భద్రత, ఉపాధి, ఆదాయ వృద్ధి కల్పించడమే ప్రభుత్వ పరమావధి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ, జౌళి శాఖ అధికారులు, టెస్కో ప్రతినిధులు, చేనేత సహకార సంఘాల నాయకులు, అవార్డు గ్రహీతలు, పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# ఏఐతో పాలనకు పదును

**హైదరాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో సాంకేతిక ఆధారిత పాలనకు మరింత ఊతమిచ్చే దిశగా కృత్రిమ మేధ వినియోగాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో జీఓవీకనెక్ట్, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీసేవ) సంయుక్తంగా నిర్వహించిన 'ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాన్‌క్లేవ్-తెలంగాణ'ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా విధాన రూపకర్తలు, సాంకేతిక రంగ నిపుణులు, డిజిటల్ పాలన నిపుణులతో మంత్రి ముఖాముఖి చర్చలు నిర్వహించారు. ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.




ప్రభుత్వ సేవల అందజేతలో సామర్థ్యాన్ని పెంచడం, నిర్ణయాల ప్రక్రియను వేగవంతం చేయడం, ప్రజల సమస్యల పరిష్కారంలో సాంకేతికతను వినియోగించడం వంటి అంశాలపై సదస్సులో విస్తృత చర్చ జరిగింది. భవిష్యత్ పాలనలో కృత్రిమ మేధ కీలక సాధనంగా మారనున్న నేపథ్యంలో దాని వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు శాఖల్లో డిజిటల్ సేవలను విస్తృతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ సేవలను మరింత ప్రజానుకూలంగా మార్చేందుకు కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు.

కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాల ద్వారా ప్రభుత్వ సేవలలో పారదర్శకత పెరగడంతో పాటు ప్రజల అవసరాలను మరింత సమర్థంగా తీర్చే అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. సాంకేతికతను ప్రజా సంక్షేమానికి ఉపయోగించే దిశగా తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. పాలనను మరింత సమర్థవంతం, పారదర్శకం, అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దేందుకు కృత్రిమ మేధతో పాటు అభివృద్ధి చెందుతున్న ఇతర సాంకేతిక పరిజ్ఞానాల వినియోగానికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సాంకేతికత ఆధారిత సుపరిపాలన ద్వారా ప్రతి పౌరుడికి మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# నేతన్నల కోసం సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):**




జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన చేనేత రంగం కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను నిలిపివేయడం వల్ల వేలాది నేతన్న కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అమలైన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి పథకాలు చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాయని కేటీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 55 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కార్మికుల పొదుపును ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం భారీగా వాటా జమ చేసిన 'నేతన్నకు చేయూత' పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల తయారీ వంటి ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా వేలాది కుటుంబాలకు నిరంతర ఉపాధి లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాలను నిలిపివేసి చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం బీమా, చేయూత పథకాలతో పాటు ఇతర ప్రోత్సాహకాలు కూడా అమలు కావడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని కేటీఆర్ మండిపడ్డారు. చేనేత భరోసా కింద ప్రతి ఏడాది రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సహాయం, వ్యక్తిగత రుణమాఫీ, సహకార సంఘాల రుణాల మాఫీ, జీఎస్టీ భారం భరిస్తామన్న హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నల జీవితాల్లో మార్పు కనిపించలేదని విమర్శించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా చేనేత రంగానికి అన్యాయం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డుల రద్దు, పలు సంక్షేమ పథకాల నిలిపివేత, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ విధింపు వంటి నిర్ణయాలు రంగంపై తీవ్ర ప్రభావం చూపాయని అన్నారు. చేనేత విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరిలో ఎలాంటి తేడా లేదని విమర్శించారు. రాష్ట్రంలోని నేతన్నల తరపున ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కేటీఆర్ తన లేఖలో డిమాండ్ చేశారు. గతంలో అమలైన అన్ని చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించి బకాయిలు విడుదల చేయాలని కోరారు. చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నికల హామీలను వెంటనే అమలు చేసి నేతన్న కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. "నేతన్న బతికితేనే చేనేత బతుకుతుంది.. చేనేత బతికితేనే మన సంస్కృతి, స్వాభిమానం సజీవంగా ఉంటాయి" అని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.



# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ నంబర్ వన్

**హైదరాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):**

సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు సేవల అందజేత, సాంకేతిక వినియోగం వంటి కీలక అంశాల్లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ప్రధాని ప్రధాన కార్యదర్శి పి.కె. మిశ్రా అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ కార్యదర్శి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ప్రధానమంత్రి కార్యాలయ ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహించిన 'ప్రగతి' సమీక్ష సమావేశంలో దేశంలోని అన్ని రాష్ట్రాల పనితీరును పరిశీలించగా తెలంగాణ అగ్రస్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. సైబర్ భద్రత రంగంలో రాష్ట్రం సాధించిన ఈ విజయం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. గత రెండు నెలల క్రితం వరకు రాష్ట్ర పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోయినా, ప్రత్యేక కార్యాచరణతో పరిస్థితిని పూర్తిగా మార్చగలిగామని డీజీపీ పేర్కొన్నారు. సమగ్ర కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రంలోని సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరును సమీక్షించిన అనంతరం జిల్లా పోలీసు యంత్రాంగం, కమిషనరేట్లు, సైబర్ విభాగం మధ్య సమన్వయ లోపాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో ఫలితాలు కనిపించాయని వివరించారు.

దేశంలోనే తొలి సైబర్ సెక్యూరిటీ బ్యూరోను తెలంగాణలో ఏర్పాటు చేయడం రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిందని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. రూ.5 లక్షలకు మించిన సైబర్ మోసాల కేసుల్లో ఈజీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలు చేస్తూ ఇప్పటికే 49 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 88 శాతం విజయవంతమైన స్పందన నమోదు కాగా, బాధితుల డబ్బు తిరిగి అందించే మనీ రిస్టోరేషన్ వ్యవస్థలో 81 శాతం ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. సహయోగ్ పోర్టల్‌లో 88 శాతం అనుసరణ, సమన్వయ పోర్టల్‌లో 97 శాతం అంతర్రాష్ట్ర సమన్వయం సాధించినట్లు డీజీపీ తెలిపారు. సైబర్ నేరాల విచారణకు ఉపయోగపడేలా 5,500 ప్రొఫైళ్లు, 15 వేల అనుబంధ సమాచారాలను పోర్టల్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గుర్తించిన మ్యూల్ అకౌంట్ హాట్‌స్పాట్ రాష్ట్రాల జాబితాలో తెలంగాణ లేకపోవడం మరో ముఖ్య విజయమని అన్నారు.

సైట్రైన్ కార్యక్రమం ద్వారా 524 మంది పోలీసు అధికారులకు సైబర్ నేరాల దర్యాప్తుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందించినట్లు తెలిపారు. సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం నిర్వహించామని, సుమారు 8.5 లక్షల మందికి సైబర్ నేరాలపై, 2 లక్షల మందికి డిజిటల్ అరెస్ట్ మోసాలపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ఈ విజయానికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఆమె బృందం, రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు చేసిన కృషి కారణమని డీజీపీ సి.వి. ఆనంద్ ప్రశంసించారు. సైబర్ భద్రతతో పాటు సీసీటీఎన్ఎస్, డయల్ 112, మాదకద్రవ్యాల నియంత్రణ, కృత్రిమ మేధ ఆధారిత పోలీసింగ్ వంటి అన్ని రంగాల్లో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ఏఐతో జీఎస్టీ ఆదాయం పెంపుపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచడంతో పాటు సులభతర వాణిజ్య వాతావరణాన్ని మెరుగుపరిచేలా సాంకేతికతను వినియోగించాలని అరవింద్ సుబ్రమణియన్ అభిప్రాయపడ్డారు.

పన్నుల లీకేజీలను అరికట్టేందుకు శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా భవన నిర్మాణ రంగంలో లీకేజీలను నివారించేందుకు మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖలను ఏఐ ఆధారిత సమగ్ర వ్యవస్థతో అనుసంధానించాలని ఆదేశించారు.

భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన అనుమతుల దరఖాస్తు దశలోనే నిర్మాణ సామగ్రి అవసరాలు, వాటికి సంబంధించిన పన్నుల అంచనాలను నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అలాగే మీసేవా, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి వంటి సేవలకు సంబంధించిన సమాచారాన్ని సమీకృతం చేస్తే పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ యాగం

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణా, గోదావరి నదులు, రాష్ట్రంలోని చెరువులు నిండుకుండల్లా కళకళలాడాలని, వ్యవసాయానికి సమృద్ధిగా నీరు అందాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో వరుణ యాగం జరుగుతుంది. యాగం అనంతరం నిర్వహించే మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ప్రభుత్వం ఈ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేస్తోంది.



## ప్రత్యామ్నాయ పంటలే రైతుకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

కలిసి నిర్వహించిన ఈ సమీక్షలో వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రైతులు వరి సాగును పెంచే అవకాశం ఉందని, భవిష్యత్తులో అది నష్టాలకు దారి తీయవచ్చని హెచ్చరించారు. ప్రతి రైతుకు స్పష్టమైన సమాచారం చేరేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 99.81 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు. ప్రజాప్రతినిధుల సహకారంతో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ వచ్చే నెల నుంచి ఎల్‌నినో ప్రభావం పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో వరి సాగు విస్తీర్ణంలో కనీసం 50 శాతం మేర ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఆయిల్‌పామ్, పప్పుధాన్యాలు, కూరగాయలు, కంది, అలసందలు, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుతం 16 లక్షలకు పైగా కొత్త కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే చేయూత పెన్షన్ల అర్హుల జాబితాలను సిద్ధం చేసి వచ్చే నెల నుంచి పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం, మండల ప్రజావాణి, యూనిఫాం కుట్టు పనులను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# హుజురాబాద్ 13వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడిగా జంగ అనిల్ కుమార్

- **పార్టీ సేవలకు గుర్తింపుగా బాధ్యతలు.. నాయకులు, కార్యకర్తల హర్షం**



**హుజురాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మున్సిపాలిటీ పదమూడవ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగ అనిల్ కుమార్‌ను పదమూడవ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తున్న అనిల్ కుమార్ సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

నియామకం అనంతరం విలేకరులతో మాట్లాడిన జంగ అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీలో నిజాయితీగా పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు లభిస్తుందని, తనకు అప్పగించిన పదవి కార్యకర్తల కష్టానికి లభించిన గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, పదమూడవ వార్డులో కాంగ్రెస్‌ను మరింత ప్రజలకు చేరువ చేయడానికి శక్తివంచన లేకుండా పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్, హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, పదమూడవ వార్డు కౌన్సిలర్ సందమల్ల పుణ్యబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల తిరుపతి, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు జంగ అనిల్ కుమార్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఈ నియామకంపై పదమూడవ వార్డు కౌన్సిలర్ సందమల్ల పుణ్యబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. అనిల్ కుమార్ నాయకత్వంలో పదమూడవ వార్డులో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున అనిల్ కుమార్‌ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేయగా, ఆయన నాయకత్వంలో వార్డులో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు మరింత చేరువ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గోపాల్‌పూర్–జీలుగుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



**ఎల్కతుర్తి, ఆగస్టు 7(తెలంగాణ ముచ్చట్లు):** గోపాల్‌పూర్–జీలుగుల ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి (రోడ్స్) శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

మండలంలోని గోపాల్‌పూర్ నుంచి జీలుగుల వరకు రహదారి మార్గంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులను మంజూరు చేయడం అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.

ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర సేవల రవాణాకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముప్పు శ్రీనివాస్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని కొనియాడారు.

ఈ సందర్భంగా జీలుగుల, గోపాల్‌పూర్ గ్రామాల ప్రజల తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి, హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు, సంబంధిత శాఖ అధికారులకు, నిధుల మంజూరుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ముప్పు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం




# వనబోజనాలతో వనదేవతలకు ప్రత్యేక మొక్కులు

**వేలేరు, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలోని శ్రీ సమ్మక్కసారలమ్మ దేవస్థానం వద్దకు గ్రామస్తులు వెళ్లి వనబోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు అప్పజెప్పారు.

# కాంగ్రెస్ కార్యాలయంలో చేనేత వేడుకలు





- **నేతన్నల సేవలను కొనియాడిన నాయకులు**

**హుజురాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా చేనేత సెల్ అధ్యక్షులు బండారి సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చేనేత కార్మికులను శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, చేనేత వృత్తి తెలంగాణ సంస్కృతికి, భారతీయ సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. దేశ ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ చేనేత కార్మికులు సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. నేతన్నల శ్రమను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా ఈ రంగాన్ని మరింత ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

ముఖ్య అతిథి రొంటాల సుహాసిని మనోజ్‌రావు మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత రంగం బలోపేతానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, స్థానిక నేతన్నలకు అండగా నిలవాలని కోరారు. కరీంనగర్ జిల్లా చేనేత సెల్ అధ్యక్షులు బండారి సదానందం మాట్లాడుతూ, చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. నేతన్నల సంక్షేమం కోసం చేపట్టే ప్రతి కార్యక్రమానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, ఆప్షన్ సభ్యులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చేనేత కార్మికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం చివర్లో చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి సేవలను నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

# కమలాపూర్‌లో నాలుగు వందల రెండు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీకి సర్వం సిద్ధం





- **ప్రణవ్ బాబు చొరవతో పేదల సొంతింటి కల సాకారం.. తవుటం ఝాన్సీ రవీందర్ హర్షం**

**హుజురాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు చొరవతో కమలాపూర్ మండలంలో నిర్మించిన నాలుగు వందల రెండు డబుల్ బెడ్‌రూమ్ గృహాలను అర్హులైన పేద లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లను అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా హనుమకొండ ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి కమలాపూర్ మండలంలోని గూడూరు, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాలను పరిశీలించారు. పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నాలుగు వందల రెండు గృహాలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేసేలా హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని నాయకులు తెలిపారు.


ఈ సందర్భంగా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ తవుటం ఝాన్సీ రవీందర్ మాట్లాడుతూ, నాలుగు వందల రెండు మంది పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరబోతుండటం ఎంతో ఆనందకరమని అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబులకు లబ్ధిదారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు, తహసీల్దార్ సురేష్, స్థానిక సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలసాని రమేష్, పుల్ల శోభన్, ఆట్ల కళ్యాణ్, పాక చంద్రమౌళి, భాషబోయిన రమేష్, మనీష్, నవీన్, రాజు, శివానందం, చందబోయిన సాయికుమార్, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అహల్యానగర్ రోడ్లు అధ్వానం.. ప్రజలకు నరకయాతన

- **రెండుచక్రాల వాహనాలు నడపలేని దుస్థితి**
- **పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థుల అవస్థలు – కనీసం మట్టి పోసి గుంతలు పూడ్చాలని స్థానికుల విజ్ఞప్తి**





**హుజురాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు అహల్యానగర్‌లో రహదారుల దుస్థితి రోజురోజుకూ మరింత తీవ్రంగా మారుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లు పూర్తిగా బురదమయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడుగడుగునా భారీ గుంతలు, నిల్వ నీరు, మురుగు కలిసిపోవడంతో రహదారిపై నడవడమే కష్టంగా మారింది. ముఖ్యంగా రెండుచక్రాల వాహనదారులు ప్రతిరోజూ ప్రమాదాలను ఎదుర్కొంటూ ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు ఏ వాహనం బురదలో జారి పడుతుందోనన్న భయంతో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.

అహల్యానగర్‌లో నివసిస్తున్న వందలాది కుటుంబాలు ఈ రహదారిపైనే ఆధారపడి నిత్యకృత్యాలు నిర్వహిస్తున్నాయి. ఉదయం ఉద్యోగాలకు వెళ్లేవారు, కూలీ పనులకు వెళ్లే కార్మికులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఈ రోడ్డు కారణంగా నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ పరిస్థితి మరింత దారుణంగా మారుతుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు.

పాఠశాలలకు వెళ్లే చిన్నారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. యూనిఫాంలు బురదతో తడిసి ముద్దవుతున్నాయని, చాలామంది విద్యార్థులు జారి పడుతూ గాయపడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను స్కూల్‌కు పంపించే ప్రతి రోజూ ప్రమాదం జరుగుతుందేమోనని భయపడాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్నవారు ఈ రహదారిపై ప్రయాణించడం మరింత కష్టసాధ్యంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు కూడా ఈ రహదారిపై సకాలంలో చేరడం కష్టంగా మారుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీటితో గుంతలు కనిపించకపోవడంతో వాహనాలు బోల్తా పడే ప్రమాదం పెరిగిందని, ఇప్పటికే పలువురు స్వల్ప గాయాలకు గురైన ఘటనలు చోటు చేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఈ సమస్యపై ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అహల్యానగర్ వాసులు ఆరోపిస్తున్నారు. సమస్యను పరిశీలిస్తామని హామీలు ఇచ్చినప్పటికీ ఆచరణలో మాత్రం ఎలాంటి పనులు జరగలేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాత్కాలిక చర్యగా మట్టి పోసి గుంతలు పూడ్చినా ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతుందని చెబుతున్నారు.

ప్రస్తుతం రోడ్డు పరిస్థితి కారణంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు, చిన్న కార్లు కూడా వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. రాత్రి సమయంలో వీధి లైట్ల వెలుతురు తక్కువగా ఉండటంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన తర్వాత రహదారి మొత్తం చెరువును తలపించేలా మారిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే అధికారులు స్పందించాలని, తాత్కాలికంగా మట్టి, గ్రావెల్ వేసి గుంతలు పూడ్చడంతో పాటు శాశ్వత పరిష్కారంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని అహల్యానగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ రహదారిని వెంటనే మరమ్మతు చేయాలని, నిర్లక్ష్యం కొనసాగితే స్థానికులంతా కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

అభివృద్ధి పనులపై పెద్దఎత్తున ప్రకటనలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు అహల్యానగర్ ప్రజల సమస్యలను కూడా గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. కనీస మౌలిక సదుపాయమైన రహదారి కూడా అందుబాటులో లేక ప్రజలు నరకయాతన అనుభవించాల్సి వస్తోందని, వెంటనే చర్యలు తీసుకుని రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి



- **పంచాయతీల్లో 12లోపు 20 పంట కుంటలు ఏర్పాటు చేయాలి**
- **తల్లాడలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 7(తెలంగాణ ముచ్చట్లు ):**గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తల్లాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో ఈ నెల 12వ తేదీలోగా కనీసం 20 పంట కుంటలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే 14వ తేదీలోగా అన్ని గ్రామ పంచాయతీలకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.
గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, ఉపాధి అవకాశాలు, నీటి వనరుల అభివృద్ధి తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని అన్నారు.
అనంతరం మండలంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి, లక్ష్యాల సాధన, గ్రామ పంచాయతీల వారీగా చేపట్టాల్సిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ఈ సమావేశంలో ఎంపీడీఓ ఏనుకూరు భాగ్యశ్రీ, ఏపీడీ చలపతి, కల్లూరు డీఎల్‌పీవో విజయలక్ష్మి, అదనపు పీడీ శిరీష, ఎంపీవో తల్లాడ హరికృష్ణ, ఏనుకూరు జీవీఎస్ నారాయణ, ఎస్‌బీఎం డీపీఎం అనూప్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తల్లాడ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు




- **పాలనలో రాజకీయాలకు తావులేదు**
- **ఆగస్టు 15 నుంచి ఆసరా పింఛన్లు**
- **తిరుమలాయపాలెంలో రూ. 7.00 కోట్ల పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 7(తెలంగాణ ముచ్చట్లు ):**అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డిగూడెం నుంచి రాకాసితండా వరకు రూ. 2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రాజారాం నుంచి తుమ్మగూడెం వరకు రూ. 4.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే హైదర్ సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో రూ. 20 లక్షల చొప్పున అంచనా వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనాలకు భూమిపూజ నిర్వహించారు.
సమగ్ర అభివృద్ధే ధ్యేయం..
ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమపాళ్లలో పరుగులు తీయిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. తిప్పారెడ్డిగూడెం అభివృద్ధికి ఇప్పటివరకు రూ. 35.55 కోట్లు, హైదర్ సాయిపేటకు రూ. 37 కోట్లు, పాతర్లపాడుకు రూ. 29.25 కోట్లు, రాజారాం గ్రామానికి రూ. 8.48 కోట్లు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. రైతాంగానికి మద్దతు ధరతో పాటు వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్, ఎకరాకు రూ. 6 వేల రైతు భరోసా జమ చేశామని గుర్తుచేశారు.
ఇందిరమ్మ ఇళ్లు పారదర్శకం..
పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎవరికీ ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి సోమవారం క్షేత్రస్థాయి ప్రగతి ఆధారంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే బిల్లులు జమ చేస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే రెండో విడత ప్రొసీడింగ్స్ అందజేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి నూతన ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిపిఓ వినోద్‌మార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే రైతులకు భరోసా

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
- **జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**





**ఖమ్మం బ్యూరో , ఆగస్టు-7(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.
శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన సేవల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం తో పంట మార్పిడి విధానాల వల్ల రైతులు నష్టపోకుండా ఉంటారని, రైతులు ప్రత్యామ్నాయ సాగు విధానాలు పాటించేలా ప్రోత్సహించాలని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు చేపట్టిన పంట కుంటలు, బోర్ రీచార్జ్, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.
స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంచి వాతావరణంలో, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి చౌక ధరల దుకాణం పరిధిలో కార్డుల సంఖ్య, లబ్ధిదారుల వివరాలు, పంపిణీ తేదీ, సమయం, వేదిక, డీలర్ల వివరాలతో ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి పంపిణీ కేంద్రానికి ఒక బాధ్యత గల అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. లబ్ధిదారుల సౌకర్యార్థం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు.
తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారులు, వైద్యాధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
పెన్షన్ దరఖాస్తుల స్వీకరణలో కూడా ప్రజలు ఒకేచోట అధిక సంఖ్యలో చేరకుండా గ్రామపంచాయతీ స్థాయిలో ప్రణాళికాబద్ధంగా దరఖాస్తులు స్వీకరించే విధానాన్ని అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సులభంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
ప్రస్తుత వర్షపాత పరిస్థితులు, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, ఆయకట్టు సాగు, తాగునీటి అవసరాలపై కూడా సమగ్రంగా చర్చించారు. జిల్లాలోని మేజర్, మీడియం, మైనర్ చెరువుల నీటి నిల్వలపై పూర్తి సమాచారాన్ని సిద్ధం చేసి, అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.
గ్రామాలలోని చెరువుల్లో నీటిని తాగునీరు, పశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయంగా వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి నీటి వినియోగంపై ప్రజలకు స్పష్టమైన సందేశం అందించాలని సూచించారు.
రైతులకు అందుబాటులో ఉన్న నీటి వివరాలు తెలిపేందుకు గ్రామీణ స్థాయిలో ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో పెద్ద ఎత్తున రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం చేయాలన్నారు.
వన మహోత్సవం కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని, వ్యవసాయ శాఖ రైతులకు పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్వో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డిఆర్డీఏ శ్రీరాం, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మనోహర్, నీటిపారుదల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'చేతిలో గొడుగు.. జనంతో అడుగు..!'



**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 7(తెలంగాణ ముచ్చట్లు ):** ఆకాశం వర్షిస్తోంది... వాన తుంపరలు కాలనీ బాటలను తడుపుతున్నాయి... అయినా ఆ ప్రజా సంకల్పం ఆగలేదు! వర్షం పడుతున్నా ఏమాత్రం వెనకడుగు వేయకుండా, ఒక చేతిలో గొడుగు పట్టుకుని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగారు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. శుక్రవారం ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, ఇందిరమ్మ కాలనీల్లో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి మంత్రి సాగించిన క్షేత్రస్థాయి పర్యటన పాలనకు ఒక కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది.
నడివీధి టీ కొట్టు వద్ద నలుగురిలో ఒకడై... వేడి టీ కప్పుతో ఆప్యాయ పలకరింపులు
హంగులు లేవు... ఆర్భాటాలు అసలే లేవు! పర్యటన మధ్యలో సాయిగణేష్ నగర్ వీధిలోని ఒక చిన్న టీ కొట్టు వద్ద మంత్రి ఆగిపోయారు. సామాన్య పౌరుడిలా అక్కడ ఉన్న బెంచ్ మీద ఆసీనులై, స్థానికులతో కలిసి వేడివేడి టీ తాగారు. ఆ తేనీటి కప్పు నురగల్లోంచే ప్రతి ఇంటా ఉన్న సమస్యలను ఆప్యాయంగా పలకరించారు. తాగునీటి తిప్పలు, కరెంట్ తీగల భయాలు, వర్షపు నీటి ఇబ్బందులను ప్రజలు మంత్రి ముందు ఉంచగా... 'నేనున్నాను' అంటూ భరోసానిచ్చారు. తమ ఊరి నేత తమ పక్కనే కూర్చుని టీ తాగుతూ కష్టసుఖాలు వినడంతో కాలనీవాసుల సంతోషం వ్యక్తం చేశారు.
రూ.100 కోట్ల నిధులతో... మోడల్ మున్సిపాలిటీగా ఏదులాపురం రూపకల్పన
ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు ఈ మంజూరు చేశారని ఈ సందర్భంగా మంత్రి ప్రకటించారు. గ్రామ పంచాయతీల కలయికగా ఏర్పడిన ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. వర్షపు నీరు నిలిచే లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత డ్రైనేజీ నిర్మాణాలు, తుమ్మ చెట్ల తొలగింపు, తాగునీటి సరఫరాను మెరుగుపరచడం వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని హామీ ఇచ్చారు.
ప్రజా అవసరాలే ప్రాధాన్యం... అధికారులకు ఆదేశాలు
ఇందిరమ్మ ఇళ్లు, స్థలాల కోసం ప్రజలు సమర్పించిన వినతులను ప్రభుత్వం అత్యంత సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉంటూ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు.
ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తులో ఐదుగురు యువకులు అరెస్ట్

- **పోలీసులను చూసి పరుగులు.. వెంటాడి పట్టుకున్న టూ టౌన్ పోలీసులు**
- **250 గ్రాముల గంజాయి, రూ.15 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం**
- **ఇన్స్పెక్టర్ బాలకృష్ణ**



**ఖమ్మం బ్యూరో , ఆగస్టు 7(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం నగరంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి, రూ.15 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఓ హోటల్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గురువారం సాయంత్రం ఐదుగురు యువకులు కలిసి గంజాయి సేవించేందుకు గంజాయి పొట్లాలతో అక్కడ ఉన్నారు. అదే సమయంలో పోలీసుల వాహనాన్ని గమనించిన యువకులు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ చేపట్టగా గత కొంతకాలంగా గంజాయి సేవిస్తున్నట్లు వారు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.
అరెస్ట్ చేసిన వారిలో ఖమ్మం నగరానికి చెందిన యిటిగల సాయి గణేష్, రెంటల ధనుష్ కుమార్, ఎం.డి. అరీ ఫ్ అహ్మద్, పోగుల సిద్ధూ, సూర్యాపేటకు చెందిన బత్తుల ఉదయ్ కిరణ్ ఉన్నారు. వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయి, రూ.15 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఐదుగురిని శుక్రవారం రిమాండ్ నిమిత్తం ఖమ్మం కోర్టుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ వెల్లడించారు.
గంజాయిపై ఉక్కుపాదం
నగరంలో గంజాయి వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల సమాచారాన్ని ప్రజలు పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# జమ్మికుంట పత్తి మార్కెట్‌కు మూడు రోజుల సెలవు

- **శనివారం నుంచి సోమవారం వరకు యార్డు బంద్.. 11న యథావిధిగా ప్రారంభం**




**జమ్మికుంట టౌన్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పత్తి మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు మార్కెట్ ఛైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వారాంతపు సెలవుతో పాటు ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతరను పురస్కరించుకుని ఆగస్టు 8 శనివారం నుంచి 10 సోమవారం వరకు మార్కెట్ యార్డు కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. 8న ప్రత్యేక సెలవు, 9న ఆదివారం సాధారణ సెలవు, 10న బోనాల జాతర సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆగస్టు 11 మంగళవారం నుంచి మార్కెట్ యార్డు యథావిధిగా ప్రారంభమవుతుంది. మూడు రోజుల సెలవులను దృష్టిలో ఉంచుకుని రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఈ తేదీల్లో మార్కెట్ యార్డుకు తీసుకురావద్దని ఛైర్‌పర్సన్ సూచించారు. మార్కెట్ తిరిగి ప్రారంభమైన అనంతరం రైతులు తమ సరుకులను యార్డుకు తీసుకురావాలని కోరారు.





# చనిపోయాకా గుర్తుండేలా బ్రతకడమే గొప్ప జీవితం!

- **కన్నేటి వెంకన్న సేవలు చిరస్మరణీయం : మంత్రి పొంగులేటి**
- **మంగళగూడెంలో విగ్రహావిష్కరణ.. ఘనంగా ద్వితీయ వర్ధంతి**

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 7(తెలంగాణ ముచ్చట్లు ):** ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఒకరోజు మరణించక తప్పదని, అయితే చనిపోయిన తర్వాత కూడా సమాజం తలుచుకునేలా, ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా జీవించడమే అత్యున్నతమైన జీవితమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం గ్రామంలో శుక్రవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు స్వర్గీయ కన్నేటి వెంకన్న రెండో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకన్న విగ్రహాన్ని మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని కూడా మంత్రి ఆవిష్కరించారు.

**పదిమందికీ మేలు చేయడమే అసలైన సంపాదన : మంత్రి పొంగులేటి**

"మానవ జన్మలో సంపాదించే ఆస్తిపాస్తుల కంటే, నలుగురికి చేసిన సాయం, సంపాదించుకున్న అభిమానమే శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. కన్నేటి వెంకన్న తన జీవితాంతం ప్రజల కోసమే తపించారని కొనియాడారు. ఏ కష్టం వచ్చినా 'నేనున్నానంటూ' నిలబడ్డారని, అందుకే ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన రూపం విగ్రహమై ఈ ఊరిలో నిలిచిందన్నారు. ఆయన చూపిన సేవా మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కన్నేటి వెంకన్న కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# పూనకాలతో పులకించిన వీణవంక.. పెద్దమ్మ తల్లికి బోనాలు

- **వేపాకులు.. శివసత్తుల పూనకాలు.. డప్పు చప్పుళ్ల మధ్య ఘనంగా ఊరేగింపు**

**వీణవంక, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలో ముదిరాజుల ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి బోనాల సమర్పణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను నెత్తిన పెట్టుకుని, వేపాకులు ధరించి, డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయం వరకు ఘనంగా ఊరేగింపుగా తరలివెళ్లారు. అనంతరం పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

బోనాల ఊరేగింపు సందర్భంగా వీణవంకలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా, డప్పుల మోత, అమ్మవారి నామస్మరణతో పండుగ వాతావరణం కనిపించింది.

ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘ నాయకులు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

- **టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి డిమాండ్**



**భీమదేవరపల్లి, ఆగస్టు 07(తెలంగాణ ముచ్చట్లు):** ఉపాధ్యాయుల, విద్యా రంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పీఆర్సీని ప్రకటించి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ భీమదేవరపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కొత్తపల్లి, రత్నగిరి, వంగర, మాణిక్యాపూర్, గట్లనర్సింగాపూర్, ముల్కనూర్ తదితర గ్రామాల పాఠశాలల్లో విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ.. పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదన్నారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పీఆర్సీ రిపోర్టు తెప్పించుకుని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు, ఉపాధ్యాయుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించి పర్యవేక్షణ పోస్టులను భర్తీ చేయాలని, బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య పథకం కోసం వేతనాల నుంచి కోత విధిస్తున్నప్పటికీ హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ రోడ్‌మ్యాప్ ప్రకారం దశలవారీ పోరాటాలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఆగస్టు 12, 13 మండల కేంద్రాల్లో వినతిపత్రాల సమర్పణ, ఆగస్టు 19 జిల్లా కేంద్రాల్లో ధర్నాలు ఆగస్టు 29 హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా: సెప్టెంబర్ సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ ప్రభుత్వ బడుల మూసివేత ఆలోచనను విరమించుకోవాలని, జీవో 25 ను సవరించి ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయించాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ జిల్లా ఉపాధ్యక్షులు చందుపట్ల రాజేంద్రం, ఇప్పకాయల కుమారస్వామి, మండల అధ్యక్ష కార్యదర్శులు కాలేసి కొమురయ్య, భిక్షపతి, లక్ష్మణ్, అనిల్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ హైస్కూలో ఘనంగా బోనాల సంబరాలు


- **విద్యార్థుల సాంప్రదాయ వేషధారణలు ఆకట్టుకున్నాయి**
- **పండుగ వాతావరణంలో అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు**

**భీమదేవరపల్లి, ఆగస్టు 7(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ హైస్కూల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో బోనాలను తయారు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి, పోతురాజు వేషధారణల్లో విద్యార్థులు అలరించగా, విద్యార్థినులు చీరకట్టులో సంప్రదాయ దుస్తులు ధరించి బోనాల సంబరాలకు మరింత శోభ తీసుకొచ్చారు. అనంతరం బోనాలను సమీపంలోని అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. ఆషాఢ, శ్రావణ మాసాల్లో జరిగే ఈ పండుగ ప్రజల భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం పాఠశాలలో బోనాల వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తిరుమణి, సదానందం, కవిత, జ్యోతి, సంధ్యారాణి, అపర్ణ, సైనిక, రవళి, సంతోషి, రామకృష్ణతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# జమ్మికుంట అభివృద్ధిపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రశ్నల వర్షం

- **రైతులకు యూరియా, డీఏపీ అందుబాటులోకి తేవాలి.. ఇసుక సమస్యకు పరిష్కారం చూపాలి**
- **తనుగుల చెక్‌డ్యామ్ పూర్తి చేయాలి.. కన్నెపల్లి పంపులు ప్రారంభించాలి**

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 07 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండల సమగ్ర అభివృద్ధిపై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శుక్రవారం విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. జమ్మికుంట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనులు, వ్యవసాయం, తాగు, సాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్, మిషన్ భగీరథ, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్షించారు. ఎంపీడీవో, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు యూరియా, డీఏపీ కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. యూరియాను యాప్ ద్వారా కాకుండా నేరుగా ఎరువుల దుకాణాల ద్వారానే రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఏపీని ఇతర ఎరువులతో కలిపి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి లేకుండా రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.

జమ్మికుంట మండలంలో ఇసుక క్వారీలు ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన ఇసుక అందుబాటులో లేకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. పక్క నియోజకవర్గాల్లో ఆన్‌లైన్ అనుమతులు లేకుండానే ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపునకు అనుమతులు ఇస్తున్నప్పుడు హుజూరాబాద్ నియోజకవర్గంలోనే ట్రాక్టర్లపై కేసులు ఎందుకు నమోదు చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. ప్రజలు, ట్రాక్టర్ యజమానులు ఇబ్బందులు పడకుండా స్పష్టమైన విధానం అమలు చేయాలని కోరారు. మండలంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని సర్పంచులకు సూచించారు. ఆయిల్‌పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తనుగుల చెక్‌డ్యామ్ దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. చెక్‌డ్యామ్ పనులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. జమ్మికుంట మండలానికి కీలకమైన కాల్వల ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. కన్నెపల్లి పంపులను వెంటనే ప్రారంభించి తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జమ్మికుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్ వంటి సాధారణ మందులు కూడా అందుబాటులో లేకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఏఎన్ఎంలు, వైద్య అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని సర్పంచులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యుత్ సరఫరాపైనా ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. రైతులకు 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తూ 24 గంటలు ఇస్తున్నామని చెప్పడం సరికాదని అన్నారు. రైతులకు అవసరమైన సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. మిషన్ భగీరథ ద్వారా మండలంలోని ప్రతి గ్రామానికి ఎలాంటి అంతరాయం లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలు అందించడమే అధికారుల ప్రధాన బాధ్యత అని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారుల తీరును సహించేది లేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# జమ్మికుంటలో ఘనంగా ఆరోగ్యశ్రీ దినోత్సవం

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 07 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ జమ్మికుంట మండల ఇన్‌చార్జి తునికి వసంత్ అధ్యక్షతన ఆరోగ్యశ్రీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని, అనంతరం కేక్‌ను అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా తునికి వసంత్ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గత మూడు దశాబ్దాలుగా సమాజంలోని అన్ని వర్గాల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అణగారిన వర్గాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. నిరుపేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో 2004లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఆరోగ్యశ్రీ పథకం సాధించడంలో మందకృష్ణ మాదిగ కీలక పాత్ర పోషించారని తెలిపారు. మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాల ఫలితంగానే ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా నేడు ఎంతోమంది పేద కుటుంబాలకు వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, పేదల సంక్షేమం కోసం ఆయన సాగించిన ఉద్యమాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మారేపల్లి శ్రీనివాస్, హుజూరాబాద్ మండల ఇన్‌చార్జి ఎర్ర ఆదిత్య, కనగర్తి సర్పంచ్ రామంచ సంపత్, నాయకులు ముంజల రాజేష్ గౌడ్, దొడ్డ అనిల్, రామంచ రాజు, రాచపల్లి సమ్మయ్య, జీడి మోహన్, రాచపల్లి వంశీ, ఎర్ర జస్వంత్ సాయి, పూరెల్ల రాహుల్, తౌడం దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



# యాప్రాల్ హత్య కేసును ఛేదించిన జవహర్ నగర్ పోలీసులు

**జవహర్ నగర్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాప్రాల్‌లో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సందీప్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. యాప్రాల్‌లోని ఆదిత్య వైన్స్ సమీపంలో సుధీర్ కుమార్ అనే వ్యక్తిపై ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.పాత కక్షల నేపథ్యంలో ఆదిత్య వైన్స్ వద్ద జరిగిన గొడవే ఈ హత్యకు కారణమని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు సందీప్ కుమార్‌కు సహకరించిన సుమిత్, వివేక్‌లను కూడా పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతున్నట్లు జవహర్ నగర్ పోలీసులు తెలిపారు.




# జవహర్ నగర్‌లో అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి సర్వే

**జవహర్ నగర్: ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కొటేష్ గౌడ్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు.

ఈ సందర్భంగా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల పరిస్థితిని పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను గుర్తించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ఈ సర్వే చేపట్టినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు కీలక హెచ్చరిక.. ఆగస్టు 16లోపు ఈకేవైసీ తప్పనిసరి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ (ఈకేవైసీ ) ప్రక్రియను పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సూచించాయి. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆగస్టు 16ను తుది గడువుగా నిర్ణయించినట్లు వెల్లడించాయి. గడువులోపు ఈకేవైసీ పూర్తి చేయని వినియోగదారులకు గ్యాస్ కనెక్షన్‌తో పాటు సబ్సిడీ నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించాయి.

అయితే ఇప్పటికే తమ గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన ఈకేవైసీ పూర్తి చేసిన వినియోగదారులు మళ్లీ ఈ ప్రక్రియ చేయాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. కొత్తగా చేయాల్సిన వారు సమీపంలోని గ్యాస్ ఏజెన్సీని సందర్శించడం ద్వారా లేదా గ్యాస్ డెలివరీ సిబ్బంది సహాయంతో ఈకేవైసీని పూర్తి చేసుకోవచ్చు.

అలాగే ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న వినియోగదారులు ఆయా గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా కూడా సులభంగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం ఉంది. చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు వినియోగదారులకు సూచించాయి.







# గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యమే కీలకం

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 07 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని మహాత్మా గాంధీ పేర్కొన్నట్లుగా, గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి సాధించి ఆదర్శ గ్రామాలుగా రూపుదిద్దుకోవాలంటే ప్రతి గ్రామస్థుడి భాగస్వామ్యం ఎంతో అవసరమని జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన అన్నారు.

జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో శుక్రవారం 'ఆదర్శ గ్రామం-ఆవశ్యకత' అంశంపై మినీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమిష్టిగా నిర్ణయాలు తీసుకోవడంతో పాటు ప్రజలు చురుకుగా భాగస్వాములైనప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించగలమని పబ్బు సులోచన తెలిపారు.

గ్రామ సర్పంచ్ మక్కమల్ల తిరుమల-వెంకటేష్ మాట్లాడుతూ బాలవికాస సంస్థ మడిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం సువర్ణావకాశమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఉపసర్పంచ్ కస్తూరి శ్రీనాథ్ మాట్లాడుతూ బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు కె. సుమలత, ఏ. స్వాతి, ఆసియా, కారోబార్ లింగమూర్తి, పంచాయతీ కార్యదర్శి అంజిరెడ్డి, వార్డు సభ్యులు సురేష్, సాయిరాం, హసీనా, శ్రీనివాస్, సాగరిక, కళ్యాణి, రాజమణి, శశివదన, ఆంజనేయులు, చంద్రమౌళి, రాజు, ఆశా కార్యకర్తలు, సీఏలు, అంగన్‌వాడీ టీచర్లు, యువజన నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







# చేనేతకు చేయూతే నిజమైన గౌరవం

- **అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మహిళా చేనేత కార్మికులకు ఘన సన్మానం**

**హుజురాబాద్, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు ):** అంతర్జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలోని బోర్నపల్లి గ్రామంలో మహిళా చేనేత కార్మికులకు ఘన సన్మానం నిర్వహించారు. బీసీ జాతీయ సంక్షేమ సంఘం మహిళా జనరల్ సెక్రటరీ దేవసాని ప్రియదర్శిని ఆధ్వర్యంలో గ్రామ వార్డు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా చేనేత కార్మికులను శాలువాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమానికి బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, సందేల వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చేనేత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, దేశ వారసత్వాన్ని కాపాడుతూ తరతరాలకు అందిస్తున్న నేతన్నలు సమాజానికి గర్వకారణమని అన్నారు. అయితే నేటికీ అనేక చేనేత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగించడం ఆందోళన కలిగించే విషయమన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. చేనేత కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, నేతన్న హస్తం, బీమా, గృహాలు, ఉపాధి భద్రతతో పాటు అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి అందించాలని కోరారు. చేనేత రంగాన్ని ఆదుకునేలా ప్రభుత్వం మరింత ప్రోత్సాహక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేవసాని ప్రియదర్శిని చేపట్టిన ఈ సన్మాన కార్యక్రమాన్ని వారు అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. చేనేత కార్మిక సంఘాలు ఐక్యంగా ముందుకు వచ్చి తమ సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చిలకామారి శ్రీనివాస్, సంగం సత్యనారాయణ, ఇప్పకాయల సాగర్, కొలిపాక క్రాంతికుమార్, (కేఆర్) బిక్షపతి, బింగి రాణి, బోర్నపల్లి గ్రామ మహిళలు, చేనేత కార్మికులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఇల్లంతకుంట సమీక్షలో అధికారులను నిలదీసిన కౌశిక్ రెడ్డి

- **కేసీఆర్ హయాంలో 24 గంటల కరెంట్.. ఇప్పుడు 12 గంటలే ఎలా?**
- **రైతులకు షాపుల ద్వారా యూరియా అందించాలి.. కన్నెపల్లి పంపులు ఆన్ చేయాలి**

**ఇల్లంతకుంట, ఆగస్టు 07 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండల సమగ్ర అభివృద్ధిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శుక్రవారం విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులతో నిర్వహించిన సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనులు, వ్యవసాయం, మిషన్ భగీరథ, విద్య, వైద్యం, విద్యుత్, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్షించారు. విద్యుత్ సరఫరాపై ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 24 గంటల విద్యుత్ సరఫరా జరిగేదని, ప్రస్తుతం కేవలం 12 గంటలే విద్యుత్ ఎలా వస్తుందని అధికారులను ప్రశ్నించారు. రైతులు, ప్రజలకు అవసరమైన సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. యూరియాను యాప్ ద్వారా కాకుండా నేరుగా ఎరువుల దుకాణాల ద్వారా రైతులకు అందించాలని సూచించారు. అన్ని ఎరువుల దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు డెడ్ లెవల్‌కు చేరుకోవడంతో రానున్న రోజుల్లో తాగు, సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కన్నెపల్లి పంపులను వెంటనే ప్రారంభించి నీటిని ఎత్తిపోయాలని సమావేశంలో తీర్మానించారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామస్థాయిలో సర్పంచుల ఆధ్వర్యంలో అర్హుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, కోడిగుడ్లు అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. న్యూట్రిషన్ కిట్లను ప్రారంభించి అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సకాలంలో అందేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. రాచపల్లి-బూజునూర్, టేకుర్తి తదితర గ్రామాలకు సంబంధించిన దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.ప్రజలకు, రైతులకు ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీవో, తహసీల్దార్, కేడీసీసీ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# జీహెచ్ఎంసీ బరిలో బీజేపీ ఒంటరి పోరు

(మొదటి పేజీ తరువాయి)

జీహెచ్ఎంసీ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని, స్వతంత్రంగా పోటీ చేసి ప్రజల మద్దతు పొందడమే లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర బీజేపీలో ఎలాంటి విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేస్తున్నారని, సరైన సమయంలో పలువురు కీలక నేతలు బీజేపీలో చేరనున్నారని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతి, పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జాతీయ నాయకత్వం సూచించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు తీరుపై ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని రామచందర్‌రావు పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో బీజేపీ బలాన్ని చాటిచెప్పే కీలక మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.



# లోక్‌సభలో ఎంజీఎం సమస్యల ప్రస్తావన

- వరంగల్ వైద్య సేవల బలోపేతానికి ఎంపీ డిమాండ్
- ఎంజీఎం, వైద్య కళాశాల సమస్యలపై దృష్టి
- ఖాళీల భర్తీకి కేంద్రాన్ని నిలదీసిన డా. కడియం కావ్య



**న్యూఢిల్లీ, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ ప్రభుత్వ వైద్య కళాశాల, మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రితో పాటు కేంద్ర సహకారంతో నడిచే ప్రభుత్వ వైద్య సంస్థల్లో నెలకొన్న సిబ్బంది కొరత అంశాన్ని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. వైద్య సేవల నాణ్యతపై ప్రభావం చూపుతున్న ఖాళీల భర్తీ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎంపీ కడియం కావ్య వైద్యులు, స్పెషలిస్టులు, నర్సింగ్ అధికారులు, పారామెడికల్ సిబ్బంది కొరతపై ప్రశ్నించారు. ముఖ్యంగా వరంగల్ ప్రాంత ప్రజలకు సేవలందిస్తున్న ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఖాళీలు ఎక్కువగా ఉండటంతో వైద్య సేవలపై ఒత్తిడి పెరుగుతోందని వివరించారు.

ఎంజీఎం ఆసుపత్రి తెలంగాణలో కీలక వైద్య కేంద్రంగా కొనసాగుతోందని, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రోగులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తగిన సంఖ్యలో నిపుణ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది లేకపోవడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నడుస్తున్న వైద్య సంస్థల్లో కూడా సిబ్బంది కొరత కొనసాగుతుండటం ఆందోళనకరమని ఎంపీ తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు, వాటి భర్తీకి కేంద్రం చేపడుతున్న చర్యలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని కోరారు.

వైద్య రంగంలో మౌలిక వసతుల విస్తరణతో పాటు తగిన మానవ వనరులు అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని కడియం కావ్య అభిప్రాయపడ్డారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే ఖాళీలను అత్యవసరంగా భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ ప్రాంత ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీ డిమాండ్ చేశారు. వైద్య సంస్థల్లో సిబ్బంది కొరతను నివారించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

# వీణవంకలో సమస్యల సుడిగుండం.. బీజేపీ ఆగ్రహం

- పారిశుద్ధ్యం, ఇసుక కొరతపై అధికారుల తీరుపై ఆగ్రహం

**వీణవంక, ఆగస్టు 07 (తెలంగాణ ముచ్చట్లు):**

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని బీజేపీ వీణవంక మండల అధ్యక్షుడు బత్తిని నరేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపరచకపోతే సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మురుగు కాలువల శుభ్రత, పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోతున్నాయని బత్తిని నరేశ్ గౌడ్ తెలిపారు. నిర్మాణ రంగంపై ఆధారపడిన కార్మికులు, సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో కొందరు కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రభుత్వం స్పందించాలని కోరుతూ బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.





# వర్షంలోనూ ప్రజల మధ్య మంత్రి

- పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయి పర్యటన
- ఏదులాపురం అభివృద్ధికి రూ.100 కోట్లు
- కాలనీల సమస్యలపై అధికారులకు ఆదేశాలు
- టీ కొట్టు వద్ద ప్రజలతో మమేకం



**ఖమ్మం, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):** వర్షం కురుస్తున్నా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయిగణేష్ నగర్, ఇందిరమ్మ కాలనీలలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి వార్డుల్లో పర్యటించిన మంత్రి స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి ప్రకటించారు. గ్రామ పంచాయతీల కలయికగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తుమ్మ చెట్ల తొలగింపు, తాగునీటి సరఫరా మెరుగుదల, అంతర్గత రహదారుల అభివృద్ధి వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాల కోసం ప్రజలు సమర్పించిన వినతులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి పేర్కొన్నారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న పార్కుల అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో పనుల్లో నాణ్యతను కాపాడాలని సూచించారు.

పర్యటనలో భాగంగా సాయిగణేష్ నగర్‌లోని ఓ చిన్న టీ దుకాణం వద్ద మంత్రి ఆగి స్థానికులతో కలిసి టీ తాగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, వర్షపు నీటి నిల్వ వంటి అంశాలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ద్వారా పాలనను మరింత ప్రజలకు చేరువ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

# గాంధీజీ అడుగుజాడల్లో వెలసిన ఖాదీ ప్రతిష్ఠాన్.. నేడు ఉనికి కోసం పోరాటం!

- ఒకప్పుడు వేలాది చేనేత కుటుంబాలకు ఉపాధి.. నేడు ఉనికి కోసం పోరాటం

**జమ్మికుంట టౌన్ ఆగస్టు 07 (తెలంగాణ ముచ్చట్లు):**

స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో 1919లో ఏర్పాటైన జమ్మికుంట మండలం వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్ (కేఎన్‌ఆర్(డీ)) నేడు ఆదరణ కోల్పోయి కష్టాలను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించిన ఈ సంస్థలో ప్రస్తుతం వంద మందికి కూడా పని లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.




స్వదేశీ నినాదంతో ప్రారంభమైన ఈ ఖాదీ సంస్థకు జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వంటి ప్రముఖులు అధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రస్తుతం పీవీ నరసింహారావు కుమార్తె వాణిదేవి సంస్థ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది చేనేత కార్మికులు ఈ సంస్థ ద్వారా జీవనోపాధి పొందేవారు. ఖాదీ ఉత్పత్తులకు మంచి ఆదరణ ఉండేది. అయితే కాలక్రమేణా ప్రభుత్వ ప్రోత్సాహం తగ్గడం, మార్కెట్‌లో మార్పులు రావడంతో సంస్థ కార్యకలాపాలు క్రమంగా క్షీణించాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాదీ సంస్థకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించి, చేనేత కార్మికులకు తిరిగి ఉపాధి కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చారిత్రక వారసత్వం కలిగిన వావిలాల ఖాదీ ప్రతిష్ఠాన్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# హామీలు కాదు.. అమలు కావాలంటూ సీపీఐ పాదయాత్ర

**ఎల్కతుర్తి, ఆగస్టు 7 ( తెలంగాణ ముచ్చట్లు):**

"హామీలు కాదు.. అమలు కావాలంటూ సీపీఐ పాదయాత్ర" అనే నినాదంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ చేపట్టిన జిల్లా వ్యాప్త పాదయాత్రలను విజయవంతం చేయాలని సీపీఐ ఎల్కతుర్తి మండల కార్యదర్శి శనిగరపు రాజకుమార్ పిలుపునిచ్చారు.

గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 6న కాజీపేటలో ప్రారంభమైన పాదయాత్రలు శుక్రవారం నుంచి గోపాల్‌పురం, ఇంద్రనగర్, చింతలపల్లి, దామెర, కొత్తపెల్లి, ముల్కనూర్, గట్ల నర్సింగాపూర్, ముస్తాపూర్, కొత్తకొండ తదితర గ్రామాల్లో కొనసాగనున్నట్లు తెలిపారు.

ఎన్నికల సమయంలో ఉపాధి, సంక్షేమం, సుపరిపాలన, మెరుగైన భవిష్యత్తు పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతుండగా, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని, ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుంగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు ప్రతి సంవత్సరం కోటి ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని రాజకుమార్ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 6 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న పాదయాత్రలు వేయి స్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ ర్యాలీతో ముగియనున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊటుకూరు రాములు, సీపీఐ మండల కార్యదర్శి శనిగరపు రాజకుమార్, నిమ్మల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ఏఐతో కొత్త వైరస్‌ల సృష్టి

- స్టాన్‌ఫోర్డ్ పరిశోధనకు ప్రపంచవ్యాప్త గుర్తింపు
- బ్యాక్టీరియాలపై పోరాటానికి కొత్త దారి
- భద్రతా ప్రమాణాలపై నిపుణుల చర్చ

అమెరికా, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):

కృత్రిమ మేధ రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఆర్క్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఏఐ సాయంతో ప్రకృతిలో ఇప్పటివరకు లేని కొత్త వైరస్‌లను రూపొందించి శాస్త్ర ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. ఈ పరిశోధనలో రూపొందించిన వైరస్‌లలో 16 వైరస్‌లు ప్రయోగశాల పరీక్షల్లో విజయవంతంగా పనిచేయడం విశేషంగా మారింది. ఈ వైరస్‌లు మనుషులు, జంతువులు, మొక్కలకు ఎలాంటి హాని కలిగించకుండా కేవలం బ్యాక్టీరియాలపై మాత్రమే దాడి చేసే విధంగా రూపొందించబడ్డాయి. శాస్త్రవేత్తలు ఈ పరిశోధన కోసం 'ఈవో1', 'ఈవో2' పేర్లతో ప్రత్యేక కృత్రిమ మేధ నమూనాలను వినియోగించారు. సాధారణంగా భాషా నమూనాలు పదాల క్రమాన్ని అంచనా వేసినట్లే, ఈ వ్యవస్థలు డీఎన్‌ఏలోని జన్యు అక్షరాల క్రమాన్ని అంచనా వేసి కొత్త వైరస్‌ల నిర్మాణాలను రూపొందించాయి. లక్షలాది జన్యు సమాచార నమూనాలను విశ్లేషించిన అనంతరం పూర్తిగా కొత్త వైరస్‌ల రూపకల్పన సాధ్యమైందని పరిశోధకులు వెల్లడించారు.

ఏఐ రూపొందించిన లక్షల వైరస్ నమూనాల్లో సుమారు 300 నమూనాలను ఎంపిక చేసి ప్రయోగశాలలో తయారు చేశారు. అనంతరం వాటిని వివిధ రకాల బ్యాక్టీరియాలపై పరీక్షించారు. ఈ పరీక్షల్లో 16 వైరస్‌లు సమర్థవంతంగా పనిచేసి తమ సామర్థ్యాన్ని నిరూపించాయి. కొన్ని వైరస్‌లు సహజసిద్ధంగా ఉండే వైరస్‌ల కంటే వేగంగా అభివృద్ధి చెందగా, మరి కొన్ని సాధారణ వైరస్‌లకు నిరోధక శక్తి పెంచుకున్న ఈ.కోలై వంటి బ్యాక్టీరియాలను కూడా విజయవంతంగా నాశనం చేశాయి. ప్రపంచవ్యాప్తంగా యాంటీబయోటిక్స్‌కు లొంగని బ్యాక్టీరియా సమస్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిశోధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. భవిష్యత్తులో అవసరానికి అనుగుణంగా నిర్దిష్ట బ్యాక్టీరియాలను లక్ష్యంగా చేసుకుని కొత్త వైరస్‌లను రూపొందించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం చికిత్సకు సవాలుగా మారుతున్న అనేక బ్యాక్టీరియా సంబంధిత వ్యాధులను ఎదుర్కొనే కొత్త మార్గాలు అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నారు.



అయితే ఈ సాంకేతికత విజయంతో పాటు కొన్ని ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. వైరస్‌ల జన్యు నిర్మాణాన్ని కృత్రిమ మేధతో రూపొందించే సామర్థ్యం పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో దుర్వినియోగ అవకాశాలను పూర్తిగా కొట్టిపారేయలేమని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రంగంలో స్పష్టమైన అంతర్జాతీయ నియంత్రణలు, భద్రతా ప్రమాణాలు అవసరమని వారు సూచిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహించిన పరిశోధనలో మనుషులు, జంతువులు లేదా మొక్కలకు సోకే వైరస్‌ల సమాచారాన్ని వినియోగించలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. అన్ని ప్రయోగాలను కఠిన భద్రతా ప్రమాణాల మధ్య నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రముఖ శాస్త్రీయ పత్రిక 'సైన్స్'లో ప్రచురితమవడంతో ప్రపంచ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించాయి. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీయగల ఈ సాంకేతికత భవిష్యత్తులో మరిన్ని కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# రెబల్ ఎంపీలకు మోదీ భరోసా

- 'ఎన్డీఏలో ప్రతి ఒక్కరికీ గౌరవం'
- పార్లమెంట్ సమావేశాలపై ఆందోళన
- అభివృద్ధి పనుల కోసం పీఎంవోను సంప్రదించండి

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):



ప్రతిపక్ష పార్టీల నుంచి ఎన్డీఏ కూటమిలో చేరిన ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను వారికి అండగా ఉంటానని స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం తన నివాసంలో నిర్వహించిన అల్పాహార సమావేశంలో కొత్తగా ఎన్డీఏలో చేరిన లోక్‌సభ సభ్యులతో ప్రధాని సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నుంచి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరిన ఏడుగురు ఎంపీలు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి విడిపోయి నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరిన 20 మంది ఎంపీలు, అజిత్ పవార్ వర్గానికి చెందిన ఇద్దరు ఎంపీలతో పాటు మొత్తం సుమారు 45 మంది సభ్యులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ప్రజాస్వామ్యానికి సర్వోన్నత వేదిక అని పేర్కొన్నారు. సభా చర్చల్లో చురుకుగా పాల్గొని ప్రజల సమస్యలను ప్రస్తావించాలని సూచించారు. తరచూ జరుగుతున్న అంతరాయాల కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి షిండే శివసేనలో చేరిన ఎంపీలతో ప్రధాని మరాఠీ భాషలో ప్రత్యేకంగా మాట్లాడినట్లు సమాచారం.

"ఆందోళన చెందకండి.. నేను మీతో ఉన్నాను" అని వారికి భరోసా ఇచ్చారు. ఎన్డీఏ ఒక కుటుంబమని, కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి సమాన గౌరవం, అవకాశాలు లభిస్తాయని చెప్పారు. నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీలకు ప్రధాని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఏ అంశమైనా నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించాలని చెప్పారు. రైతులు, కార్మికులు, పేదల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్లమెంట్‌లో కీలక రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సమీకరించే క్రమంలోనే ఎన్డీఏలో చేరిన కొత్త ఎంపీలతో ప్రధాని సమావేశం నిర్వహించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సమావేశం అనంతరం ప్రధాని ప్రతి ఎంపీతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

# నీట్ లీక్‌లో నిపుణుల పాత్ర

- సీబీఐ ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు
- ప్రశ్నలు కంఠస్థం చేసి బయటకు తరలింపు
- కోచింగ్ కేంద్రాల ద్వారా విద్యార్థులకు చేరవేత
- 20 వేల పేజీల ఆధారాలు కోర్టుకు సమర్పణ

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):



దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన నీట్ యూజీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. మొత్తం 94 పేజీలతో రూపొందించిన నివేదికలో ప్రశ్నపత్రం లీకేజీకి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీతో అనుబంధం ఉన్న ముగ్గురు సబ్జెక్టు నిపుణులే ప్రధానంగా బాధ్యత వహించినట్లు పేర్కొంది. ప్రశ్నపత్రాల రూపకల్పన ప్రక్రియలో భాగస్వాములైన ఈ నిపుణులు తమకు ఉన్న ప్రాప్యతను దుర్వినియోగం చేసి గోప్య సమాచారాన్ని బయటకు చేరవేసినట్లు దర్యాప్తులో తేలిందని వెల్లడించింది. సీబీఐ గుర్తించిన నిందితుల్లో పీవీ కులకర్ణి, మనీశ్ మాంధారే, మనీషా హవల్దార్ ఉన్నారు. వీరిలో కులకర్ణి రసాయన శాస్త్రం, మాంధారే వృక్ష శాస్త్రం, హవల్దార్ భౌతిక శాస్త్ర విభాగాలకు చెందిన నిపుణులు. ప్రశ్నపత్రాల తయారీ సమయంలో వీరు ప్రశ్నలను కంఠస్థం చేసుకుని, అనంతరం వాటిని చీటీలపై రాసుకున్నట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. కొన్ని ప్రశ్నలకు సంబంధించిన అంశాలను పాఠ్యపుస్తకాలలో గుర్తులు పెట్టి భద్రపరిచినట్లు కూడా సీబీఐ వెల్లడించింది.

ప్రశ్నల రూపకల్పన, అనువాద విభాగాలకు ఈ నిందితులకు ప్రత్యక్ష ప్రాప్యత ఉండటంతో గోప్య సమాచారాన్ని కోచింగ్ కేంద్రాలకు చేరవేసినట్లు దర్యాప్తులో తేలింది. డిజిటల్ మార్గాలను వినియోగించకుండా వ్యక్తిగత పరిచయాల ద్వారానే సమాచారాన్ని అందించినట్లు గుర్తించారు. ఈ విధంగా ఆధారాలు మిగలకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వ్యవహరించినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. లీకైన ప్రశ్నలను కోచింగ్ తరగతుల్లో విద్యార్థులతో సాధన చేయించినట్లు సీబీఐ తెలిపింది. సులభంగా గుర్తుంచుకోగల ప్రశ్నలను ముందుగా కంఠస్థం చేసుకుని, తరువాత హోటల్ గదుల్లో కాగితాలపై రాసేవారని దర్యాప్తులో తేలింది. విద్యార్థుల విజయశాతం పెంచడం, ఆర్థిక లాభాలు పొందడం ప్రధాన లక్ష్యాలుగా ఈ కుట్ర సాగినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఈ వ్యవహారంలో పరీక్ష నిర్వహణ సంస్థ భద్రతా వ్యవస్థలో కూడా లోపాలు ఉన్నట్లు సీబీఐ గుర్తించింది. పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు, భద్రతా పరిశీలనలు సమర్థవంతంగా జరగలేదని నివేదికలో పేర్కొంది. ముఖ్య నిందితుల్లో ఒకరైన కులకర్ణి మూడు ప్రశ్నపత్రాల సమితులకు సంబంధించిన అనువాద బాధ్యతలు నిర్వహించాడని, కేవలం మూడు రోజుల్లో 135 ప్రశ్నలను అనువదించినట్లు వెల్లడించింది. కేసులో ఇప్పటివరకు మొత్తం 13 మందిని అరెస్టు చేసినట్లు సీబీఐ తెలిపింది. వీరిలో సబ్జెక్టు నిపుణులు, కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు, మధ్యవర్తులు, లీకేజీ ద్వారా లబ్ధి పొందిన విద్యార్థులు ఉన్నారు. దర్యాప్తులో భాగంగా 360 మంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసి, సుమారు 20 వేల పేజీల ఆధారాలను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టుకు సమర్పించింది. ప్రస్తుతం నిందితులందరూ న్యాయపరమైన నిర్బంధంలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



# చేనేతకు రాష్ట్రపతి ప్రశంసలు

- జాతీయ చేనేత పురస్కారాల ప్రదానం
- రాష్ట్రపతి భవన్‌లో ఘన వేడుకలు
- చేనేత వారసత్వాన్ని కొనియాడిన ద్రౌపది ముర్ము
- యువత కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలని పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 7 (తెలంగాణ ముచ్చట్లు):

12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై సంత్ కబీర్ చేనేత పురస్కారాలు, జాతీయ చేనేత పురస్కారాలు–2025 విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ భారత నాగరికత పరిణామ క్రమంలో చేనేతకు శతాబ్దాల చరిత్ర ఉందని పేర్కొన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాంతీయ ప్రత్యేకతలను ప్రతిబింబించే గొప్ప వారసత్వంగా చేనేత రంగం నిలిచిందన్నారు. భారతదేశంలోని విభిన్న ప్రాంతాల కళాత్మక నైపుణ్యాన్ని చేనేత ఉత్పత్తులు ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయని రాష్ట్రపతి తెలిపారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన నేసిన వస్త్రాలు భారత వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. సంప్రదాయ చేనేత కళలను ఆధునిక రూపకల్పనలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమర్థవంతమైన బ్రాండింగ్, అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానం ద్వారా చేనేత ఉత్పత్తులకు మరింత విస్తృత అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. యువ పారిశ్రామికవేత్తలు, రూపకర్తలు, నవ్య ఆలోచనలతో ముందుకొచ్చే సంస్థలు చేనేత రంగంలో కొత్త అవకాశాలను సృష్టించగలవని రాష్ట్రపతి సూచించారు. సాంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దితే భారత చేనేత ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతుందన్నారు. చేనేత రంగం లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తున్నదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. చేనేత కళాకారుల కృషి దేశ గర్వకారణమని కొనియాడుతూ, వారి సేవలను గుర్తించి పురస్కారాల ద్వారా గౌరవించడం సంతోషకరమని తెలిపారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in